
సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 25 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



కాసుల కోసం కంత్రీ వేషాల్

'సమగ్రశిక్ష'లో జరిగిన సిమెంట్ గోల్ మాల్ వ్యవహారంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది లీలలు వెలుగులోకి వస్తున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం
35.6°/22.3°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

సకాలంలో రీ సర్వే పూర్తి చేస్తాం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించిన కలెక్టర్ అరుణ్‌బాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' పథకం కింద జిల్లాలో చేపట్టిన భూముల రీసర్వే సకాలంలో పూర్తి చేస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డికి తెలిపారు. శనివారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న భూ హక్కు, రీ సర్వే, ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాల పురోగతి, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై మాట్లాడారు. కలెక్టరేట్‌లోని స్పందన వీసీ హాలు నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య తదితరులు వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, భూముల రీ సర్వే జిల్లాలో పకడ్బందీగా సాగుతోందన్నారు. రీసర్వేలో జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను చేరుకునేందుకు తగిన చర్యలు చేపట్టామన్నారు. కర్ణాటక రాష్ట్రానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లోని రైతులు వలసలు వెళ్లడంతో వారిని పిలిపించి హద్దులు ఏర్పాటు చేయడం, నోటీసులు పంపి రీ సర్వే చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రామకృష్ణ, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీటీఐలకు నేడు బదిలీలు

రాప్తాడురూరల్: ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రభుత్వ స్కూళ్లలో పని చేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ (ఆర్ట్, వర్క్, హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్)ల రిక్వెస్ట్ బదిలీల కౌన్సెలింగ్ ఆదివారం చేపట్టనున్నారు. ఉదయం 10.30 గంటలకు అనంతపురంలోని సమగ్ర శిక్ష కార్యాలయానికి రావాలని ఏపీఓ సాయిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు.

కస్తూర్బా కళకళ



తరగతి గదిలో శ్రద్ధగా పాఠం వింటున్న రొళ్ల కేజీబీవీ విద్యార్థినులు

నిష్ణాతులైన ఉపాధ్యాయులు.. నాణ్యమైన విద్య... అధునాతన తరగతి గదులు.. సౌకర్యాలు.. మెనూ ప్రకారం పౌష్టికాహారం.. అందుకే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ) కళకళలాడుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం ప్రవేశాలకు భారీ పోటీ నెలకొనగా ఇప్పటికే చాలా పాఠశాలల్లో 'సీట్లు లేవు' బోర్డులు దర్శనమిస్తున్నాయి.

- కేజీబీవీల్లో తొలివిడతలోనే సీట్ల భర్తీ
- బోధన, సౌకర్యాల మెరుగుతో భారీ పోటీ
- ఉత్సాహంగా చిన్నారులను చేర్పిస్తున్న తల్లిదండ్రులు
- ఆరు నుంచి ఇంటర్ వరకు ప్రవేశాలు పూర్తి
- చాలా పాఠశాలల్లో సీట్లు లేవని ప్రకటన


సాక్షి, పుట్టపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తూ అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అధికారం చేపట్టిన ఏడాది లోపే సంపూర్ణంగా అమలు చేశారు. దీంతో సర్కారు పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు పోటీగా నిలిచాయి. ముఖ్యంగా నిరుపేద కుటుంబాల్లోని బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి సబ్జెక్టుకూ టీచర్‌ను నియమించి బోధనలో సమూల మార్పులు తీసుకువచ్చారు. అలాగే సకల సౌకర్యాలు కల్పించి మెరుగైన మెనూతో పౌష్టిహాకారం అందిస్తున్నారు. ఫలితంగా పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఉత్సాహంగా వస్తున్నారు. దీంతో కేజీబీవీల్లో సీట్లకు భారీ డిమాండ్ పెరిగింది.

సీట్లు లేవని బోర్డులు

జిల్లా వ్యాప్తంగా 30 కేజీబీవీలున్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఏటా ఆరో తరగతి ప్రవేశాలకు సంబంధించి ఒక్కో పాఠశాలలో 40 సీట్లు చొప్పున మొత్తంగా 1,200 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 15 పాఠశాలల్లో సీట్లన్నీ భర్తీ అయ్యాయి. మిగతా పాఠశాలల్లో ఒకటి, రెండు చొప్పున ఖాళీ ఉన్నాయి. అదేవిధంగా 7, 8, 9, 10 తరగతులకు సంబంధించి మిగులు సీట్లు సింగిల్ డిజిట్‌లో మాత్రమే ఖాళీలు ఉన్నాయి. కార్పొరేటు పాఠశాలల కంటే కస్తూర్బా విద్యాలయాల్లో సీట్లకు డిమాండ్ పెరిగింది. జిల్లాలోని 30 కేజీబీవీల్లో హిందూపురం, ధర్మవరం, కదిరిలో మైనార్టీలకు కేటాయించారు. మైనార్టీలతో భర్తీ చేయగా.. మిగులు సీట్లను ఇతరులకు కేటాయించనున్నట్లు ఉపాధ్యాయులు వివరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత ఉన్న వారికి మాత్రమే ప్రవేశాలు కల్పించారు.

ఆరో తరగతిలో ప్రవేశాలు ఇలా..

అగళి, బత్తలపల్లి, బుక్కపట్నం, సీకే పల్లి, గాండ్లపెంట, గుడిబండ, కనగానపల్లి, ముదిగుబ్బ, నల్లమాడ, రొళ్ల, రొద్దం, రామగిరి, సోమందేపల్లి, తాడిమర్రి, తనకల్లులోని కస్తూర్బా స్కూళ్లలో 40 సీట్లూ భర్తీ అయ్యాయి. అమడగూరులో 39, అమరాపురంలో 39, గోరంట్లలో 39, తలుపులలో 39, పరిగిలో 39, లేపాక్షిలో 39, మడకశిరలో 39, ఎన్‌పీ కుంటలో 38, నల్లచెరువులో 38, ఓడీ చెరువులో 38, చిలమత్తూరులో 37, హిందూపురం (మైనార్టీ)లో 36, ధర్మవరం (మైనార్టీ) లో 35, పుట్టపర్తిలో 35, కదిరి (మైనార్టీ)లో 34 సీట్లు భర్తీ అయ్యాయి. మిగులు సీట్లకు కూడా ప్రస్తుతం భారీ పోటీ ఉన్నట్లు తెలుస్తోంది.



గాండ్లపెంట కస్తూర్బా పాఠశాలలో ప్రవేశాలు పూర్తయినట్లు బోర్డు అతికించారు. పాఠశాలలో నలభై సీట్లు ఉండగా, ప్రవేశాలకు భారీ పోటీ నెలకొంది. దీంతో అర్హత ఆధారంగా సీట్లను భర్తీ చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.



స్టడీ అవర్‌లో చదువుకుంటున్న అగళి కేజీబీవీ విద్యార్థినులు

సౌకర్యాలు బాగున్నాయి



కస్తూర్బా పాఠశాలలో సౌకర్యాలు బాగున్నాయి. ఫుడ్ మెనూ బాగుంటోంది. స్టడీ హవర్స్ నిర్వహిస్తారు. 'నాడు-నేడు' పథకంతో పాఠశాలను పూర్తిగా మార్చేశారు. మరుగుదొడ్ల నిర్వహణ బాగుంది. నిరంతర విద్యుత్ సరఫరా, నీరు అందుబాటులో ఉంటోంది. ఎలాంటి ఇబ్బంది లేదు. – నవ్యశ్రీ, 9వ తరగతి, బత్తలపల్లి

అర్హత ఆధారంగా ప్రవేశాలు



ఆరో తరగతి సీట్లన్నీ భర్తీ అయ్యాయి. అర్హత ఆధారంగా ప్రవేశాలు కల్పించాం. తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. విద్యార్థుల హాజరు 100 శాతం ఉంటోంది. ప్రస్తుతం పాఠశాలలోని పదో తరగతిలో ఒక సీటు మాత్రమే ఖాళీగా ఉంది. ఇంటర్ మొదటి సంవత్సరంలో 16 సీట్లు, రెండో సంవత్సరానికి సంబంధించి 29 సీట్లు ఖాళీగా ఉన్నాయి. – వాణిశ్రీ, ప్రిన్సిపాల్, తాడిమర్రి కేజీబీవీ

త్వరలోనే మిగులు సీట్ల భర్తీ



జిల్లాలోని 30 కేజీబీవీలకు గానూ ఏటా 1,200 మందికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీల్లో ఏడో తరగతిలో 13 సీట్లు, 8వ తరగతిలో 7 సీట్లు, 9వ తరగతిలో 8 సీట్లు, 10వ తరగతికి సంబంధించి 23 మిగులు సీట్లు ఉన్నాయి. త్వరలోనే వాటిని భర్తీ చేస్తాం. అర్హత ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించాం. – చింతా రంగస్వామి, ఇన్‌చార్జి డీఈఓ

కుష్టు నిర్మూలనకు కృషి చేద్దాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: కుష్టు వ్యాధి నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. వ్యాధి నిర్ధారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కుష్టు వ్యాధి నిర్ధారణ అవగాహన కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కుష్టు వ్యాధి నిర్ధారణ కోసం 26 నుంచి జూలై 16వ తేదీ వరకూ ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గృహ సందర్శన చేసి కుష్టు వ్యాధి లక్షణాలపై స్వీయ పరీక్ష చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, పొడలు, చర్మంపై బుడిపెలు తదితర లక్షణాలుంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఎండీటీ మందులు అందజేస్తారన్నారు. 6 నుంచి 12 నెలల పాటు చికిత్స తీసుకుంటే వ్యాధిని నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, డీఆర్‌ఓ కొండయ్య, డీఎల్ఏటి తిప్పయ్య, కమిటీ సభ్యులు శివరంగప్రసాద్, డిప్యూటీ ఈఎంఓ వీరమ్మ, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

'పద్మశ్రీ'కి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: రిపబ్లిక్ డే సందర్భంగా అందించే పద్మశ్రీ అవార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యువజన సంక్షేమ శాఖ సీఈఓ కేశవనాయుడు తెలిపారు. 2024 సంవత్సరానికి గాను కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, సాంఘిక సేవ, సైన్సు, ప్రజా సంబంధాలు, సివిల్‌సర్వీసెస్, ట్రేడ్, ఇండస్ట్రీ తదితర విభాగాల్లో విశేష కృషి చేస్తున్న వారు పురస్కారాలకు అర్హులని పేర్కొన్నారు. సెప్టెంబర్ 15లోపు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు https//awards.gov.in వెబ్‌సైట్ చూడాలన్నారు.

అది బాబు భజన యాత్ర

- 14 ఏళ్లు సీఎంగా ఉండి చంద్రబాబు ఏమి ఒరగబెట్టారు?
- చెప్పుకోవడానికి ఒక్క పథకమూ లేదు
- టీడీపీకి కాలం చెల్లిపోయింది
- కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి



మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి: 'భవిష్యత్ గ్యారంటీ పేరుతో టీడీపీ చేపట్టిన యాత్ర... చంద్రబాబు భజన యాత్ర. ప్రజల కష్ట సుఖాలు తెలుసుకోకుండా బస్సులో ప్రయాణిస్తూ బాబు భజన చేస్తున్నారు. ప్రజల మద్దతు కరువై బస్సుయాత్ర కాస్తా తుస్సుయాత్రగా మారింది' అని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి విమర్శించారు. శనివారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ ప్రజలు మెచ్చిన పాలనను అందిస్తుంటే చంద్రబాబు వైఎస్సార్ సీపీ పథకాలను కాపీ కొట్టి మినీ మేనిఫెస్టో అంటూ ప్రకటించడం సిగ్గుచేటన్నారు. జగన్ సంక్షేమ పథకాలతో రాష్ట్రం శ్రీలంక లాగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుందని చెబుతున్న చంద్రబాబు... అదే నోటితో 'అమ్మ ఒడి' లాంటి పథకాలను ప్రవేశ పెడతానని చెప్పడం ఆయన దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. 2014 ఎన్నికలకు మునుపు చంద్రబాబు 600కుపైగా హామీలతో గద్దెనెక్కి ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు చేసిన పాపాన పోలేదన్నారు. రైతు ఆత్మహత్యలు చంద్రబాబు పాలనలోనే ఎక్కువగా జరిగాయని ఎమ్మెల్యే గుర్తు చేశారు. సంపద సృష్టించి సంక్షేమ పథకాలను అమలు చేస్తానని ఇప్పుడు చెబుతున్న చంద్రబాబు... మరి 14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు ఎందుకు సంపద సృష్టించలేక పోయారని ప్రశ్నించారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనతి కాలంలోనే దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ముందంజలో ఉందన్నారు. ప్రధానంగా విద్య, వైద్య రంగాల్లో ఎన్నడూ లేనంత అభివృద్ధి జరిగిందన్నారు. 17 మెడికల్ కాలేజీలు ఏకకాలంగా మంజూరు చేయడం గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. జగన్ పాలనలో ఎక్కడా రాజకీయ హత్య జరగలేదని, కానీ చంద్రబాబు పాలనలో ఎన్ని హత్యలు జరిగాయో టీడీపీ నాయకులు గుర్తు చేసుకుంటే మంచిదన్నారు.

కందికుంట బతుకే నేర చరిత్ర

టీడీపీ కదిరి ఇన్‌చార్జ్‌గా చెప్పుకునే కందికుంట వెంకటప్రసాద్ బతుకే హత్యలు, దౌర్జన్యాలు, కబ్జాలని ఎమ్మెల్యే సిద్దారెడ్డి విమర్శించారు. అతను కూడా గొడ్డలి అంటూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. హత్యల సంస్కృతి ఎవరిదో ప్రజలందరికీ తెలుసన్నారు. కదిరి నియోజకవర్గం ఈ నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి చెందిందనీ, ప్రతి చెరువునూ కృష్ణా జలాలతో నింపామన్నారు. సీఎం జగన్ పుణ్యమా అని కదిరికి రూ.350 కోట్లతో బైపాస్‌రోడ్డు ఏర్పాటు, కదిరి మీదుగా విజయవాడ-బెంగళూరు మధ్య ఎక్స్‌ప్రెస్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం, 716జీ జాతీయ రహదారి... ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయన్నారు. కదిరికి నీళ్లివ్వకుండా గతంలో చంద్రబాబు కుప్పంకు నీరు తీసుకెళుతుంటే స్థానిక టీడీపీ నాయకులు నోరు మెదపలేదని, ఇప్పుడు వారు జగన్ పాలనను విమర్శిస్తే ప్రజలు టీడీపీకి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. 2024లో కూడా కదిరిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తామన్నారు. రాష్ట్రంలో మరోసారి జగన్ సీఎం కావడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాదిక్, కుర్లి శివారెడ్డి, మణికంఠ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్టిక్కర్ నకిలీది

- ఐదుగురు యువకులూ అనంతపురం వాసులే
- గంజాయి మత్తులోనే వాహనాన్ని వేగంగా నడిపారు
- టోల్‌చార్జ్ మినహాయింపు కోసమే నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మాధవ రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: ''టోల్ చార్జ్‌ను మినహాయింపు పొందడం, పోలీసులు, రవాణా శాఖ అధికారులు కారు నిలపకుండా ఉండేందుకే యువకులు కారుకు ఎమ్మెల్యే స్టిక్కర్ అతికించారు. వాస్తవానికి అది నకిలీది. గంజాయి మత్తులో ఉన్న వారు కారు వేగంగా నడిపి ఆటోను ఢీ కొట్టారు. ఐదుగురు యువకులదీ అనంతపురం నగరమే'' అని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. గంజాయి మత్తుతో శుక్రవారం ముదిగుబ్బ వద్ద హల్‌చల్ చేసిన యువకుల వివరాలను ఎస్పీ శనివారం రాత్రి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు... ముదిగుబ్బ పట్టణం కాకతీయ రెస్టారెంట్ సమీపంలో శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, కదిరివైపు నుంచి వస్తున్న ఇన్నోవా (ఏపీ09 సీహెచ్ 2373) వాహనం కాస్త దూరంలోనే ఆగిపోయింది. దీంతో హెడ్ కానిస్టేబుల్ నరసింహమూర్తి, సిబ్బంది కారు వద్దకు వెళ్తుండగా, వెనక్కు తిప్పుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. ఆలోపే పోలీసులు కారువద్దకు చేరుకుని అందులోని ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడైన యలమకురి నాగ భాస్కర్, బిన్న ఫరీద్ అలియాస్ షేక్ ఫరీద్, దాసరి కార్తీక్, మెట్ల దీపక్, గరిటకాళ్ల కార్తీక్ అనంతపురానికి చెదిన వారు. వీరంతా అన్నమయ్య జిల్లా మొలకల చెరువుకు చెందిన జావిద్ దగ్గర రూ.600 చెల్లించి ఒక్కొక్కరు 20 గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం గంజాయి సేవించి అక్కడి నుంచి అనంతపురం వైపు వస్తూ కాళసముద్రం సమీపంలో స్కూటర్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని ఆపి అతనిపై దాడి చేసి రూ. 3 వేలు ఫోన్ పే ద్వారా బదిలీ చేయించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 2:00 గంటల సమయంలో ముదిగుబ్బలో అతివేగంగా వాహనాన్ని నడుపుతూ ఆటోను ఢీకొట్టడంతో డ్రైవర్ గాయపడ్డాడు. అనంతరం పోలీసులకు పట్టుబడ్డారని ఎస్పీ వివరించారు. ప్రజా ప్రతినిధుల స్టిక్కర్లు వాహనాలకు అతికించుకోవడం నేరమన్నారు. ఇలా ఎవరైనా ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కంబగిరి రాముడు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వాల్మీకి రిజర్వేషన్ పోరాటానికి మద్దతివ్వండి



వాల్మీకి సంజయకుమార స్వామితో ఎంపీ తలారి రంగయ్య

పావగడ: వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పోరాటానికి మద్దతివ్వాలని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య కోరారు. స్థానిక నిడుగల్ వాల్మీకి పీఠాధిపతి వాల్మీకి సంజయ కుమార స్వామి దుర్గానికి ఆయన శనివారం విచ్చేశారు. స్వామీజీ ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ ఆంధ్రలో వెనుకబడిన బోయ, వాల్మీకి సామాజిక వర్గాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించారన్నారు. తమ పోరాటానికి కర్ణాటకకు చెందిన వాల్మీకి స్వామీజీల మద్దతు కోసం నిడుగల్‌కు వచ్చానన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ప్రముఖులు రత్నగిరి సంస్థాన దొర రాజ రంగప్ప రాజు, పాళేగార్ లోకేశ్, మంజునాథ్, కదిరే హళ్లి రాజప్ప, తిమ్మయ్య, బలరామ్ పాల్గొన్నారు.

జింక అనుమానాస్పద మృతి



గోరంట్ల: జింక అనుమానాస్పద రీతితో మృతి చెందిన ఘటన స్థానిక జామియా మసీదు సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. శనివారం ఉదయం మసీదు సమీపంలో రోడ్డుపై జింక కళేబరం గుర్తించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు కళేబరాన్ని స్థానిక పశువైద్యశాలకు తరలించగా.. వైద్యాధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. జింక కిడ్నీ కింది భాగంలో బలమైన గాయం కావడంతో రక్తస్రావమై మృతి చెందిందని పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. గుర్తు తెలియని దుండగులు అటవీ ప్రాంతంలో చంపి గోరంట్లలో పడేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

కాసుల కోసం కంత్రీ వేషాల్

- 'సమగ్ర శిక్ష'లో సిమెంట్ దొంగల నిర్వాకం
- ఆపరేటర్ డీఈ.. అటెండర్ ఈఈ
- ఆ హోదాల్లోనే బుకింగ్.. అప్రూవల్స్
- సాక్షి కథనానికి స్పందించిన 'అనంత', శ్రీసత్యసాయి కలెక్టర్లు
- ఉద్యోగం నుంచి కంప్యూటర్ ఆపరేటర్ తొలగింపు
- విచారణ చేపట్టాలని సమగ్ర శిక్ష ఏపీఓకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..



అనంతపురంలోని సమగ్ర శిక్ష కార్యాలయం

రాప్తాడురూరల్: సమగ్ర శిక్ష కార్యాలయంలోని 'సిమెంట్ దొంగల' లీలలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సాగించిన ఈ దందాలో ఆసక్తికరమైన విషయాలు బయటపడుతున్నాయి. ఒక ఉద్యోగి డీఈగా, మరో ఉద్యోగి ఈఈగా అవతారం ఎత్తారు. ఈ తతంగమంతా స్వయంగా ఈఈ కార్యాలయంలోనే చోటు చేసుకోవడం అనుమానాలకు తావిస్తోంది. ఉదయం నుంచి సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ విభాగాధిపతి అయిన ఈఈ వద్దే ఈ ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉంటారు. అయినా అధికారులు వీరి వ్యవహారాన్ని పసిగట్టలేకపోవడంపై సమగ్ర శిక్ష ఉద్యోగులే పెదవి విరుస్తున్నారు. సిమెంట్ దొంగల వ్యవహారంపై శనివారం 'సాక్షి'లో 'సమగ్ర'లో సిమెంటు దొంగలు శీర్షికన ప్రచురితమైన కథనం ఉమ్మడి జిల్లాలోని సమగ్ర శిక్ష అధికారులు, ఉద్యోగుల్లో దుమారం రేపింది. దాదాపు 35 లోడ్ల దాకా సిమెంట్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలించారని అనుకుంటున్నా.. ఇది రెట్టింపు సంఖ్యలో ఉంటుందని సమగ్ర శిక్ష ఉద్యోగులే చెబుతున్నారు. అనంతపురం కలెక్టర్ గౌతమి, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు స్పందించి 'సిమెంట్ దొంగల' వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. ఇందులో కంప్యూటర్ ఆపరేటర్ పాత్ర ఉన్నట్లు తేలడంతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. మరో ఉద్యోగి కూడా ఇందులో కీలకపాత్ర పోషించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సమగ్ర శిక్ష ఏపీసీ, డీఈఓ సాయిరామ్‌ను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. ప్రత్యేక బృందాలతో డీఈఓ విచారణ చేయిస్తున్నారు.

అది నాబార్డ్ స్కూళ్లు, కేజీబీవీ కాలేజీల సిమెంటు..

'మనబడి నాడు–నేడు' పనులకు కేటాయించిన సిమెంట్‌ను మాయం చేసినట్లు తొలుత అనుమానించినా... తర్వాత అది నాబార్డు స్కూళ్లు, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో నిర్మాణ పనులకు కేటాయించిన సిమెంటుగా గుర్తించారు. సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 57 నాబార్డు స్కూళ్లు, 17 కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో వివిధ నిర్మాణ పనులు టెండర్ల ద్వారా జరుగుతున్నాయి. కొన్ని చోట్ల పనులు కూడా పూర్తయ్యాయి. ఈ పనులకు అవసరమైన సిమెంటు కావాలంటే సంబంధిత కాంట్రాక్టర్ డీడీ చెల్లించి డీఈకి అందజేయాలి. డీఈ తన లాగిన్‌లో ఇండెంట్ పెడతారు. దాన్ని ఈఈ ఆమోదం తెలిపి కలెక్టర్‌కు పంపుతారు. కలెక్టర్ ఆమోదముద్ర వేసిన తర్వాత నేరుగా వైఎస్సార్ నిర్మాణ్ పోర్టల్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి సంబంధిత కంపెనీలకు వెళ్లి సిమెంట్ లోడు పంపేముందు బుక్ చేసిన డీడీ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీ నమోదు చేసిన తర్వాత కంపెనీ నుంచి సిమెంట్ పంపుతారు.

డీఈగా కంప్యూటర్ ఆపరేటర్... ఈఈగా అటెండర్

ఉమ్మడి జిల్లా నుంచి శ్రీసత్యసాయి జిల్లాగా విడిపోయిన తర్వాత ఆ జిల్లా డీఈ, ఈఈ పేర్ల మీద కొత్త లాగిన్లు వచ్చాయి. ఆ రెండింటినీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమవద్దే ఉంచుకుని డీఈ, ఈఈ పేర్లతో వారే లాగిన్ అయ్యారు. డీఈగా కంప్యూటర్ ఆపరేటర్ ఫోన్ నంబరు, ఈఈగా అటెండర్ ఫోన్ నంబరు ఫీడ్ చేశారు. డీఈగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ సిమెంట్ బుక్ చేస్తే... ఈఈగా ఉన్న అటెండర్ అప్రూవల్ చేస్తాడు. తన లాగిన్‌కు వచ్చిన వెంటనే అత్యవసర పనులు కావడంతో కలెక్టర్ అప్రూవల్ చేసేస్తారు. కొన్ని సందర్భాల్లో శ్రీసత్యసాయి జిల్లాలో పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు వీరి ద్వారానే సిమెంట్ బుక్ చేయించుకున్నారు. ఆ జిల్లాకు కొత్త లాగిన్లు రాలేదంటూ వారిని బుకాయిస్తూ... మీ అవసరానికి అనంతపురం డీఈ, ఈఈ పేర్ల మీద బుక్ చేస్తున్నామంటూ ఇద్దరు ఉద్యోగులు చెప్పినట్లు తెలిసింది.

ముగ్గురు సైట్ ఇంజినీర్ల సహకారం?..

ఈఈ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగుల అక్రమాలకు శ్రీసత్యసాయి జిల్లాలో పని చేస్తున్న ముగ్గురు సైట్ ఇంజినీర్లు కూడా సహకరించారు. ధర్మవరం నియోజకవర్గం, రాప్తాడు నియోజకవర్గంలో పని చేస్తున్న వారిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సిమెంట్ లోడ్లు రాగానే చాలావరకు వీరే అమ్మకాలు చేయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో వీరికి వాటాలు ఇచ్చినట్లు తెలిసింది.

ఇదో పెద్ద స్కామ్..

సమగ్ర శిక్షలో వెలుగు చేసిన ఈ సిమెంట్ పక్కదారి వ్యవహారం పెద్ద స్కామ్‌లా ఉందని పలువురు చెబుతున్నారు. అదే డిపార్ట్‌మెంట్ వారితో కాకుండా బయట డిపార్ట్‌మెంట్ వారితో విచారణ చేయిస్తే అసలైన సూత్రధారులు, పాత్రధారులు ఎవరనేది వెలుగుచూసే అవకాశం ఉంది. పెద్దల సహకారం లేకుండా ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇంత పెద్ద స్థాయిలో ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించే ధైర్యం చేస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించి స్వాహా చేసిన ప్రభుత్వ సొమ్మును రికవరీ చేస్తేనే ఉద్యోగుల్లో భయం ఉంటుందనే చర్చ జరుగుతోంది.

సీఎం చేతుల మీదుగా 'బైపాస్ కెనాల్' భూమిపూజ

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: హంద్రీనీవా బైపాస్ కెనాల్ నిర్మాణానికి త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా భూమిపూజ చేయనున్నట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కల్లుమర్రి సమీపంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కెనాల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని రూ.214.85 కోట్లు మంజూరు చేశారని, నిర్మాణం పూర్తయితే మడకశిర ప్రాంత రైతులకు కృష్ణా జలాలు పూర్తి స్థాయిలో అందించడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు.

పోలీసుల కళ్లు గప్పి పరారై.. మళ్లీ వచ్చాడు!

హిందూపురం అర్బన్: పోలీసుల కళ్లు గప్పి ఓ నిందితుడు పరారయ్యాడు. ఏమైందో తెలియదు కానీ, మళ్లీ తిరిగొచ్చి లొంగిపోయాడు. వివరాలిలా ఉన్నాయి. లేపాక్షి మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. కల్తీ కల్లు అమ్ముతున్న మండలంలోని కల్లూరుకు చెందిన రామాంజప్పను అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని హిందూపురం సెబ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. 'సెబ్' కానిస్టేబుళ్లు వైద్య పరీక్షల నిమిత్తం తీసుకెళ్తున్న సమయంలో రామాంజప్ప పరారయ్యాడు. అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సెబ్ పోలీసుస్టేషన్ ఇన్‌చార్జ్ సీఐ స్వర్ణలత ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే రామాంజప్ప సెబ్ పోలీసు స్టేషన్‌కు వచ్చాడు. తెలిసిన వారు కనిపించి బెయిల్ ఇప్పిస్తామంటే వెళ్లానని, వారు సహకరించకపోవడంతో మళ్లీ వెనక్కి వచ్చానని పోలీసులకు చెప్పాడు. నిందితుడిని కోర్టులో చూపిన అనంతరం రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించండి

ప్రశాంతి నిలయం: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 26, 27 తేదీల్లో తప్పనిసరిగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహించాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను జిల్లా ఇన్‌చార్జ్ విద్యాధికారి రంగస్వామి శనివారం ఓ పత్రికా ప్రకటనలో ఆదేశించారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, నాడు –నేడు తదితర అంశాలతో పాటు పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలన్నారు. చర్చకు వచ్చిన అంశాలపై నివేదిక తయారు చేసి అందజేయాలని ఆదేశించారు.

యువకుడి ఆత్మహత్య

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో శనివారం సాయంత్రం మహేశ్వరరెడ్డి (24) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన మేరకు మృతుని స్వగ్రామం కడప జిల్లా చక్రాయిపేట మండలం. బతుకు తెరువుకోసం కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి రెండేళ్లక్రితం వలస వచ్చాడు. పనిచేసుకోవాలని తండ్రి నాగసుబ్బారెడ్డి మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

వ్యక్తి బలవన్మరణం

లేపాక్షి: మండలంలోని పులమతి గ్రామానికి చెందిన హనుమంతప్ప (45) అనే వ్యక్తి తాగుడుకు బానిసై బలవన్మరణం పొందినట్లు ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. మృతుని భార్య సజ్జక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. 6 నెలల క్రితం ఆటోలో నుంచి కిందపడడంతో హనుమంతప్ప భుజం దెబ్బతింది. అప్పటి నుంచి తాగుడుకు బానిస అయ్యాడు. కొంతమందితో అప్పు కూడా చేశాడు. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో మద్యం సేవించిన విషయంపై భార్యాభర్తలిద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో తన ఇద్దరు ఆడపిల్లలతో కలిసి ఇంట్లోని హాల్‌లో సజ్జక్క నిద్రించగా, హనుమంతప్ప బెడ్‌రూంలోకి వెళ్లాడు. పైకప్పునకు ఉన్న ఇనుప కడ్డీకి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం గుర్తించిన భార్యాపిల్లలు కేకలు వేశారు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు చేరుకుని మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చప్పగా టీడీపీ బస్సు యాత్ర

నల్లమాడ: 'భవిష్యత్‌కు గ్యారెంటీ' పేరుతో టీడీపీ చేపట్టిన బస్సు యాత్ర శనివారం మండలంలో చప్పగా సాగింది. బొగ్గలపల్లి నుంచి నల్లమాడ మీదుగా పుట్టపర్తి వైపు యాత్ర సాగింది. వైఎస్సార్ కూడలిలో మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి, అనంతపురం మాజీ ఎంపీ కాల్వ శ్రీనివాసులు ఓపెన్ టాప్ జీపు నుంచి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీకే పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, బీసీ నాయకుడు సామకోటి ఆదినారాయణ తదితరులున్నా మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. టైం అయిపోతోంది.. త్వరగా బండి ముందుకుపోనీ అంటూ 'పల్లె' గదమాయించారు. పైగా.. వెంగళమ్మచెరువు వద్ద పులిహోరా, కేసరీబాత్ చేయించాం, మంచి భోజనం వడ్డిస్తాం.. అందరూ అక్కడికి రండి.. అంటూ పల్లె పదే పదే విజ్ఞప్తి చేయడం గమనార్హం. బస్సు యాత్రకు టీడీపీ అధినేత చంద్రబాబు హాజరవుతారని టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. ఆయన రావడం లేదని తెలుసుకున్న కార్యకర్తలు వెనుదిరిగి వెళ్లిపోవడంతో యాత్రకు స్పందన కరువైంది.

తుస్సుమన్న బస్సు యాత్ర

కొత్తచెరువు:కొత్తచెరువులోనూ టీడీపీ బస్సు యాత్ర జనం లేక తుస్సుమంది. నాయకులు, కార్యకర్తలు అంతంత మాత్రంగానే రావడంతో సాయంత్రం నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వెలవెలబోయింది.

కార్యకర్తల నిరుత్సాహం

ఎన్‌పీకుంట: మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు చేపట్టాల్సిన బస్సుయాత్ర అర్ధరాత్రి దాటిన తరువాత నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సాహంగా ఉన్న తెలుగు తమ్ముళ్లు సమయం గడిచే కొద్దీ నిరాశకు గురయ్యారు. అదిగో.. ఇదిగో వస్తున్నారంటూ వేచి చూసి ఆకలితో అలమటించారు.

టేకులోడు క్రాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- బొలెరో వాహనాన్ని ఢీ కొన్న ఫార్చునర్
- ఇద్దరు రైతుల మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



నుజ్జునుజ్జు అయిన ఫార్చునర్ వాహనం



మృతి చెందిన మధు, శంకర్‌రెడ్డి

చిలమత్తూరు: కొత్తిమీరను మార్కెట్‌లో విక్రయించి ఇంటిదారి పట్టిన ఇద్దరు రైతులు మార్గమధ్యంలోనే రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. ఈ సంఘటన శనివారం మండల పరిధిలోని 544ఈ జాతీయ రహదారిపై టేకులోడు గురుకుల పాఠశాల సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... మండలంలోని పాతచామలపల్లికి చెందిన రైతులు మధు (27), శంకర్‌రెడ్డి (48) కొత్తిమీర సాగుచేశారు. శనివారం కొత్తిమీర లోడుతో శంకర్‌రెడ్డికి చెందిన లగేజీ బొలెరో వాహనంలో డ్రైవర్ అంజినాయక్‌తో కలిసి హిందూపురం మార్కెట్‌కు బయలుదేరి వెళ్లారు. అక్కడ పంట విక్రయించి స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. టేకులోడు గురుకుల పాఠశాల సమీపంలో జాతీయ రహదారి నుంచి చిలమత్తూరుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇదే సమయంలో వేగంగా వచ్చిన ఫార్చునర్ వీరి వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో బొలెరోలో ఉన్న మధు అక్కడికక్కడే మృతి చెందాడు. శంకర్‌రెడ్డి, డ్రైవర్ అంజి నాయక్ గాయపడ్డారు. స్పందించిన స్థానికులు క్షతగాత్రులను 108లో హిందూపురం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. శంకర్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరు తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే అతను మృత్యువాత పడ్డారు. దీంతో మృతదేహాన్ని తిరిగి హిందూపురం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పాతచామలపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. మధుకు భార్య, ఇద్దరు పిల్లలుండగా, శంకర్‌రెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కారులో నలుగురు ప్రయాణిస్తుండగా వారంతా సురక్షితంగా బయటపడ్డారు. ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా వెంకటేశ్వరరావు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్) నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ రఘునందన్ అడిషనల్ డీఎంఈగా విజయవాడకు బదిలీ అయ్యారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- యువతకు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య సూచన



సర్టిఫికెట్ అందజేస్తున్న పీడీ నరసయ్య, ప్రిన్సిపాల్ లక్ష్మయ్య

పుట్టపర్తి అర్బన్: యువత నైపుణ్యాలు పెంపొందించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య సూచించారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ డెవలపర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శనివారం బుక్కపట్నంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలు పెంపొందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. నైపుణ్యాలు పెంచుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. కొత్త ఆవిష్కరణలూ చేయవచ్చన్నారు. అనంతరం 35 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం, ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రమోహన్, ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, కళాశాల ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ వెంకటేశ్వర ప్రసాద్, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ విజయభారతి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తేజ్‌కుమార్, శివప్రసాద్, శిక్షకులు మహేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచండి



మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి

కొత్తచెరువు: రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్.ఎస్.అమ్మిరెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ రెడ్డితో కలసి డీఎస్పీలు, సర్కిల్ అధికారులతో నేర సమీక్ష నిర్వహించారు. డీఐజీ మాట్లాడుతూ క్రమం తప్పకుండా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. అవసరమైతే స్టేషన్‌కు రోజువారిగా హాజరు కావాలని ఆదేశించాలన్నారు. పరిస్థితిని బట్టి పీడీ యాక్టు నమోదుకు సిఫార్సులను జిల్లా అధికారులకు పంపాలన్నారు. ఎన్‌డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రహదారుల్లో బ్లాక్ స్పాట్‌లను గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. పోక్సో కేసుల్లో సాంకేతిక ఆధారాల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లోకల్ చట్టాలపై పోలీస్ సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ మాధవ రెడ్డి మాట్లాడుతూ అసాంఘిక శక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బక్రీద్ నేపథ్యంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. సున్నితమైన ప్రదేశాలలో వాహనాల తనిఖీ చేయరాదన్నారు. అనుమతి లేని జంతువధ శాలలను మూసివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సెబ్ ఈఎస్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పనిచేయండి:కలెక్టర్

పుట్టపర్తి అర్బన్: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల ప్రయోజనం కలిగేలా ఇంటింటి సర్వేలో సమగ్ర డేటా సేకరించాలని, ఇందులో వలంటీర్లు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. శనివారం సాయంత్రం పుట్టపర్తి మండలం నిడిమామిడి గ్రామంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు, ప్రజలతో సంభాషించారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు పథకాలు అందకుండా ఉండరాదనేది సీఎం వైఎస్ జగన్ ఆశయమన్నారు. ఈ నేపథ్యంలోనే జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. జూన్ 24 నుంచి 30 వరకూ ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు నమోదు చేసుకోవడంతో పాటు ప్రభుత్వ పరంగా ఏదైనా పథకం అర్హత ఉండీ రాకపోతే సంబంధిత వివరాలను సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, గ్రామ, వార్డు సచివాలయాల నోడలాఫీసర్ శివారెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మధులత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 1,308 దరఖాస్తులు..

జిల్లాలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి జిల్లాలోని 42 సచివాలయాల పరిధిలో 1,308 దరఖాస్తులు వచ్చినట్లు నోడలాఫీసర్ శివారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.